

డీసీసీబీకి రెండు విశిష్ట అవార్డులు



డీసీసీబీ చైర్మన్‌కు అవార్డు బహూకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (ఆప్కాబ్) 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం విజయవాడలోని గవర్నర్‌పేట ఎం.బి. విజ్ఞానకేంద్రంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరుకాగా, ఆప్కాబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాయలసీమలోని సహకార బ్యాంకుల పరిధిలో డిపాజిట్లు, రుణపంపిణీ, వసూళ్ళు, నిర్ణీత గడువుకంటే ముందుగానే సింగిల్ విండోల కంప్యూటరీకరణ వంటి అంశాలను ప్రాతిపదికన తీసుకుని 'ఓవరాల్ పర్ఫార్మెన్స్' కింద 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ పనితీరు కనబరచిన చిత్తూరు జిల్లా సహకార బ్యాంకును అవార్డుకు ఆప్కాబ్ ఎంపిక చేసింది.మంత్రి అచ్చెన్నాయుడు చేతులమీదుగా చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు చేతులమీదుగా బ్యాంకు సీఈవో సి. శంకర్‌బాబు సర్టిఫికెట్, మెమెంటోతో పాటు రూ.3లక్షల నగదు బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి కోసలనగరం, వాయల్పాడు, ఏర్పేడు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రేణిగుంట, మదనపల్లె, గంగాధరనెల్లూరు సింగిల్ విండోలు అన్నిరంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆప్కాబ్ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయా సింగిల్‌విండోల త్రిసభ్య కమిటీ చైర్మన్లు, సీఈవోలు కార్యక్రమానికి హాజరై మంత్రి నుండి సర్టిఫికెట్, మెమెంటో, రూ.20 వేల చొప్పున పారితోషికాన్ని అందుకున్నారు. ఆప్కాబ్ ఎండీ డాక్టర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి రాజశేఖర్, సహకారశాఖ రిజిస్ట్రార్ అహ్మద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నుంచి అవార్డును స్వీకరించిన ఆరు సింగిల్ విండోల చైర్మన్లు, సీఈవోలతో డీసీసీబీ సీఈవో సి. శంకర్ బాబు

మణీంద్రం ఎంపీటీసీ టీడీపీ కైవసం!



అరుణకు బీ ఫారం అందజేస్తున్న ప్రభుత్వ విప్ శ్రీకాంత్

రామకుప్పం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని మణీంద్రం ఎంపీటీసీగా టీడీపీ అభ్యర్థి అరుణ ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే కానుంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎంపీటీసీగా గెలుపొందిన శాంతకుమారి అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఉప ఎన్నిక అవసరమైంది. గత నెల 30 నుంచి ఈనెల 1వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ జరిగింది. టీడీపీ అభ్యర్థులుగా అరుణ, విశాలాక్షి, వైసీపీ అభ్యర్థిగా అర్పిత నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 2న జరిగిన నామినేషన్ల పరిశీలనలో సాంకేతిక కారణాలతో విశాలాక్షి, అర్పిత నామినేషన్లను ఎన్నికల అధికారి తిరస్కరిం టీడీపీ అభ్యర్థి అరుణ ఒక్కరే బరిలో మిగిలారు. సోమవారం రామకుప్పం వచ్చిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అరుణకు పార్టీ బీ ఫారం అందజేశారు. అనంతరం స్థానిక టీడీపీ నేతలతో కలసి బీఫాంను ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్‌కు అరుణ అందజేశారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుందని,ఆ గడువు ముగిసిన తర్వాత అరుణ ఎంపీటీసీగా ఎన్నికైనట్టు డిక్లరేషన్ ఫారం అందజేస్తామని ఆయన తెలిపారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ శాఖ సర్వే

నివాసాలు లేని చోట్ల నిరుపయోగంగా పరికరాలు

తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు కోసం చర్యలు

వందలాది ఎకరాల్లో వేల ప్లాట్లకు లే అవుట్లు వేశారు. అయిన వారికి మంచి ప్రాంతంలో, కానివారికి కొండల్లో, గుట్లలో ప్లాట్లు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం చేసుకోలేనివారికి కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేశారు.దీంతో ఆర్థిక స్తోమత ఉన్న వారు ఇళ్లు కట్టుకున్నారు. లేని వారు ఆ వైపు వెళ్లడం మానేశారు. దీంతో జిల్లాలో వందలాదిగా వేసిన జగనన్న లే అవుట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.ఈ లే అవుట్లలో విద్యుత్ సరఫరా చేయడానికి ట్రాన్స్‌కో స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు లాగారు.ఖాళీగా వున్న లే అవుట్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, తీగలు నిరుపయోగంగా పడి వున్నాయి.అక్కడక్కడా దొంగలపరమవుతున్నాయి.మరోవైపు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమైన చోట్ల ఏర్పాటు చేసేందుకు ట్రాన్స్‌కో కొనాల్సి వస్తోంది.దీంతో నిరుపయోగంగా పడి వున్న విద్యుత్ తీగలను, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ఉపయోగించుకోవడానికి విద్యుత్ శాఖ సర్వే చేపట్టింది.



బండపల్లిలోని జగనన్న లే అవుట్‌లో ఖాళీగా ప్లాట్లు

చిత్తూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 535 జగనన్న కాలనీలున్నాయి. వాటిల్లో వేల సంఖ్యలో ప్లాట్లు వేశారు. ఇందులో సగానికి పైగా కొండలు, గుట్టలు ఇళ్ల నిర్మాణానికి పనికిరానివే. దీంతో కొంతమందే ఇళ్లను నిర్మించుకున్నారు. ఇళ్లు నిర్మించుకునే సామర్థ్యం లేని కొందరు బేస్‌మెంట్ వరకు, ఇంకొంత మంది అది కూడా వేయకుండా ఖాళీగా ఉంచేశారు. అయితే లే అవుట్ ఏర్పాటు చేసిన వెంటనే విద్యుత్ సదుపాయం కోసం కిలో మీటర్ల కొద్దీ విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశారు. కొన్ని కాలనీల్లో ప్రత్యేకంగా సబ్‌స్టేషన్లు కూడా నిర్మించారు. సాధారణంగా 50 సర్వీసులకు ఒక సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. అయితే జగనన్న కాలనీలకు అప్పటి ప్రభుత్వ ఆదేశాలతో 15 సర్వీసులకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.ఇళ్లే లేని చోట రూ.కోట్ల విలువ చేసే విద్యుత్ పరికరాలు నిరుపయోగంగా పడివున్నాయి.

కాలనీల్లో రూ.250 కోట్ల ఖర్చు

జిల్లాలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ సదుపాయం ఏర్పాటు కోసం రూ.250 కోట్ల దాకా ఖర్చు చేశారు. అయితే ఈ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి సంఖ్య సగానికికంటే తక్కువేనని చెప్పాలి.కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడం, పట్టాలు ఊరికి దూరంగా కొండలు, గుట్టల్లో ఇవ్వడం. సెంటు భూమిలో ఇళ్లు నిర్మించుకోవడానికి ఇష్టపడకపోవడం.... ఇలా అనేక కారణాల చేత ఇళ్లు నిర్మించుకోలేదు. గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకోకుంటే పట్టాలు రద్దు చేస్తామని బెదిరించడంతో డ్వాక్రా రుణాలు తీసుకొని అనేక మంది బేస్‌మెంట్ వరకు నిర్మించుకొని వదిలేశారు. ఉదాహరణకు చిత్తూరు నగరానికి దూరంగా ఉన్న బండపల్లి ప్రాంతంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ సుమారు 1300 ప్లాట్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో కూడా ఇళ్లు నిర్మించుకోలేదు.ఈ ఒక్క ప్రాంతానికే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 25వరకూ ఏర్పాటు చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు, స్తంభాలు ఇతర పరికరాలు కలిపి రూ.3.50 లక్షలు ఖర్చయింది. అంటే ఈ ఒక్క జగనన్న కాలనీలో సుమారు రూ.90 లక్షల మేర ఖర్చు చేశారు. ఈ పరికరాలన్నీ కూడా నిరుపయోగంగానే ఉన్నాయి. ఇదే అదునుగా దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలను మాయం చేస్తున్నారు.ఈ పరిస్థితుల్లో నిరుపయోగంగా ఉన్న ఆ విద్యుత్ పరికరాలను తొలగించి అవసరమైన చోట్ల వాడుకునేందుకువిద్యుత్ శాఖ యోచన చేస్తోంది.ఇందుకోసం జగనన్న కాలనీల్లో సర్వే నిర్వహిస్తోంది.

సర్వే చేస్తున్నాం

జగనన్న కాలనీలకు, టిడ్కో ఇళ్లకు ఇచ్చిన సర్వీసుల్లో నిరుపయోగంగా ఉన్న సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లపై సర్వే నిర్వహిస్తున్నాం. లక్షలాది రూపాయల విలువ చేసే విద్యుత్ పరికరాలు పాడవకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే చేపట్టింది. నిరుపయోగంగా ఉన్న వాటిని తొలగించి మరో చోట వినియోగదారులకోసమే ఉపయోగించనున్నాం. కేవలం నిరుపయోగంగా ఉన్న వాటిని మాత్రమే తొలగించే అవకాశం ఉంది.

- అమర్‌బాబు, కన్‌స్ట్రక్షన్స్ డీఈ

గురుకులాల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయకర్త పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. రామకుప్పం బాలుర పాఠశాలలోని ఐదో తరగతిలో 41 సీట్లు, ఆరో తరగతిలో ఎనిమిది, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీలో 18, బైపీసీలో తొమ్మిది సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విజలాపురం బాలుర గురుకుల విద్యాలయంలో ఐదో తరగతిలో 35 సీట్లు, ఆరో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో రెండు, చిత్తూరులో బాలికలకు ఐదో తరగతిలో 27 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీలో ఐదు, బైపీసీలో ఒకటి, పలమనేరులో ఐదో తరగతిలో ఆరు, ఎనిమిదో తరగతిలో ఒకటి, ఎంఈసీలో 30, సీఈసీలో నాలుగు, కుప్పంలో బాలికలకు ఐదో తరగతిలో 41, ఏడో తరగతిలో ఒకటి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీలో తొమ్మిది, బైపీసీలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన బాల, బాలికలు ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి సీట్లను పొందాలని కోరారు.

బీఎల్వోలకు రెట్టింపు గౌరవ వేతనం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీలో కీలకపాత్ర పోషించే బూత్ లెవ్ ఆఫీసర్ల(బీఎల్వోల)కు ఏడాది కాలానికిచ్చే గౌరవ వేతనాన్ని రెట్టింపు చేశారు. అలాగే ఇప్పటి వరకు కేవలం బీఎల్వోలకు, సూపర్‌వైజర్లకు మాత్రమే గౌరవ వేతనం చెల్లించేవారు. తాజాగా అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో), సహాయ ఈఆర్వోలకు కూడా గౌరవవేతనాన్ని చెల్లించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. 2015వ సంవత్సరం తర్వాత ఇప్పుడు మరోసారి గౌరవ వేతనాన్ని పెంచారు. ఏడాదికాలానికి బీఎల్వోలకు రూ.6వేల నుంచి రూ.12వేలకు, సూపర్‌వైజర్లకు రూ.12వేల నుంచి రూ.18వేలకు పెంచారు. ఈసారి నుంచి ఈఆర్వోలకు రూ.30వేలు, ఏఈఆర్వోలకు రూ.25వేల చొప్పున చెల్లిస్తారు. ఉత్తమ పనితీరు చూపే బీఎల్వోలకు ప్రోత్సాహకం కింద మరో రూ.6వేలను ఇవ్వనున్నారు.

మద్యం కుంభకోణంలో దోచుకున్న సొమ్మంతా కక్కిస్తాం

మంత్రి సత్యకుమార్



మంత్రి సత్యకుమార్‌తో ఎమ్మెల్యే థామస్, కోకకోలా కంపెనీ ప్రతినిధి ప్రియదర్శన్

పాలసముద్రం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేసి శిక్షిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. కోకకోలా కంపెనీ సహకారంతో పాలసముద్రం పీహెచ్‌సీలో నిర్మించిన మరుగుదొడ్లను, ఆపరేషన్ థియేటర్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. శాంతిపురం, విజయపురం, చౌడేపల్లె, తవణంపల్లెల్లోని పీహెచ్‌సీల్లోనూ కోకకోలా కంపెనీ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లను, ఆపరేషన్ థియేటర్లను వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు.అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ధనదాహంతో నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారని గుర్తుచేశారు. మద్యం కుంభకోణంలో దోచుకున్న వేలకోట్ల సొమ్మంతా కక్కిస్తామన్నారు.ప్రజలు కూడా ఆలోచించి కూటమి ప్రభుత్వానికి అండదండలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విప్ థామస్ మాట్లాడుతూ.. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సీసీరోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో సుధారాణి,ఆర్డీవో అనుపమ, ఎంపీపీ శ్యామలాశివప్రకాష్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్, కోకకోలా కంపెనీ ప్రతినిధి హిమామ్ ప్రియదర్శన్, తహసీల్దార్ అరుణకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నాయకులు వాసు నాయుడు, శివా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు మాకూ వర్తింపజేయాలి

అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్



చిత్తూరు సీడీపీవో కార్యాలయంలో సెల్‌ఫోన్లను చూపిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తక్కువ వేతనాలకు పనులు చేస్తున్న తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ప్రగతిశీల యూనియన్ పిలుపుతో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లను సీడీపీవోలకు అందించారు. చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్లకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్ కిందకు తేవాలని కోరారు. సంక్షేమ పథకాలను వర్తింపజేయకుంటే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి 2025-26, 2026-27 సంవత్సరాల వరకు స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 50 ఏళ్ల లోపున్న ఎస్ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్) / పీఈటీలు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేయాలని సూచించారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించరని పేర్కొన్నారు.

31లోపు కుప్పానికి కృష్ణా జలాలు

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



రామకుప్పం సింగిల్ విండో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న శ్రీకాంత్

రామకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ లోపు కుప్పానికి కృష్ణా జలాలు వస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు.రామకుప్పం సింగిల్‌విండో చైర్మన్‌గా మహ్మద్ రఫీ, డైరెక్టర్లుగా సురేష్, ఆంజప్ప సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీకాంత్ మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 87శాతం మేర పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన 13శాతం పనులు కూడా అప్పుడే పూర్తయ్యేవని, వైసీపీ నేతలు కుటిలబుద్ధితో కొంతమంది రైతులతో కోర్టులో కేసులు వేయించడం వల్ల జాప్యం జరిగిందన్నారు. అధికారంలో ఐదేళ్ళు కొనసాగిన వైసీపీ నేతలు కక్షపూరిత వైఖరితో మిగిలిన 13శాతం హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు పూర్తి చేయలేదన్నారు.తీరా ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఎన్నికల్లో లబ్ధి కోసం ట్యాంకర్ల ద్వారా హంద్రీ-నీవా కాలువలో నీరు పారించి, బటన్ నొక్కి అభాసు పాలయ్యారన్నారు.గత ఏడాది చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు వేగవంతమయ్యేలా అధికారులను పరుగులు తీయించారన్నారు. కొద్ది రోజుల్లోనే ఆ పనులు పూర్తయి, ఈనెల 31లోపు కుప్పానికి జలాలు వస్తాయన్నారు.చంద్రబాబు నేతృత్వంలో కుప్పం నియోజకవర్గం రానున్న నాలుగేళ్లలో ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. రైతులు, ప్రజల సౌకర్యం కోసం విమానాశ్రయం ఏర్పాటవుతోందన్నారు. విమానాశ్రయం కోసం భూములిచ్చి సహకరిస్తున్న రైతుల పట్ల టీడీపీ ఎంతో కృతజ్ఞతతో వ్యవహరిస్తోందన్నారు. 2018లో భూములిచ్చిన రైతులకు ఇటీవల వడ్డీతో సహా నష్టపరిహారం చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విమానాశ్రయంతో బాటు 500 ఎకరాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలు అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తారన్నారు. అభివృద్ధి విషయంలో కుప్పం ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో 'హను అబ్బవరం'


కుమారుడితో కిరణ్ అబ్బవరం దంపతులు

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్వామి సన్నిధిలో తన కుమారుడికి 'హను అబ్బవరం' అని నామకరణం చేసినట్టు సినీ హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. భార్య నటి రహస్య, కుమారుడితో కలిసి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. హనుమజ్జయంతి రోజున పుట్టినందున కొడుక్కి హను అబ్బవరం అని పేరు పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ', 'కె ర్యాంప్' సినిమాల షూటింగ్ జరుగుతోందన్నారు.

తిరుమలలో సూర్య, జ్యోతిక



ఆలయం వద్ద సూర్య, జ్యోతిక దంపతులు - కుమారుడు దేవ్, కుమార్తె దియా

ప్రముఖ తమిళ హీరో సూర్య, జ్యోతిక దంపతులు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి తిరుమలకు చేరుకున్న వీరు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తమ ఇద్దరు పిల్లలు దేవ్, దియా పాటు స్వామిని దర్శించుకున్నారు. సూర్య దంపతులను చూసేందుకు, వారితో సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.25 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,339

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. విజయవాడకు చెందిన క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ ఎండీలు శ్రీనివాస్, చక్రవర్తి రూ.1.05 లక్షల విలువైన బిజినెస్ ఎక్స్‌పీ స్కూటర్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విద్వేషాలను రెచ్చగొట్టేవారి పనిబట్టండి స్వామీ!

● మంత్రి కొలుసు పార్థసారధి


కొలుసు పార్థసారధి

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే- అటువంటి వాటిని అణగదొక్కాలని స్వామిని ప్రార్థించా'నని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ నీటితో కళకళలాడుతున్నాయన్నారు.

భూసమస్యలు బోలెడు

● పరిష్కరించాలంటూ బాధితుల వేడుకోలు

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'మా భూములు కబ్జా అయ్యాయి. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా పరిష్కారం చూపండి' అంటూ ఎందరో బాధితులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 02 అర్జీలు రాగా, అందులో 162 భూ సమస్యలకు సంబంధించినవే. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...


వినతిపత్రాలను స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

వితంతు పింఛను ఇచ్చి ఆదుకోండి



'నా భర్త గ్రానైట్ వేసే కూలీపనికి వెళ్లేవాడు. పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛను ఇప్పించి ఆదుకోండి' అంటూ గీత అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.



మా భూములు కబ్జా చేశారు.. పరిరక్షించండి

మాభూమిని గెరటయ్య అనే వ్యక్తి కబ్జా చేశాడంటూ బాలాయపల్లి మండలం వాక్యం గ్రామానికి చెందిన విజయమ్మ, మరికొందరు కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. 'గ్రామంలోని 8 ఎకరాల్లో 30 ఏళ్లుగా వర్షాధారంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఐదేళ్ల కిందట నిమ్మ మొక్కలు నాటాం. గెరటయ్య దౌర్జన్యంగా ప్రవేశించి నిమ్మ చెట్లను తొలగించారని తిరిగి పెన్సింగ్ వేస్తే దానిని దౌర్జన్యంగా తొలగించాడని బాధితులు అధికారులెదుట వాపోయారు. ఇలా పంటలపై దౌర్జన్యం చేస్తుండటంతో సదరు భూమిపై కబ్జాదారులుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మా ఇంటి స్థలం కబ్జాచేశారు.



'మాది నిరుపేద కుటుంబం. నా వికలత్వ పింఛనుతో తల్లిదండ్రులను పోషించుకుంటున్నా. ఆరు సెంట్ల ఇంటి స్థలాన్ని చెల్లయ్య, తిరుపాలు తదితరులు కబ్జా చేశారు. నేను వికలాంగుడిని కావడంతో నాపై దౌర్జన్యం చేసి దూషిస్తున్నారు' అంటూ సత్యవేడుకు చెందిన సౌందరరాజ్ ఆవేదన చెందారు. కబ్జాదారులు ఆక్రమించిన ఇంటి స్థలాన్ని తిరిగి ఇప్పించాలని అధికారుల ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు.

మౌలిక వసతులు కల్పించండి



మాది పుత్తూరు మండలం నంది మంగళం పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ. మా దళిత వాడలో మౌలిక వసతులు కల్పించండి.. అంటూ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కోనేటిపాళెంలో దళితవాడకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ఇంటి స్థలాలు కల్పించాలని కోరారు. లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు.

22 ఏ నుంచి మా భూములకు విముక్తి కలిగించండి



తిరుపతి రూరల్ మండలం దామినేడులోని 22/ఏ నుంచి తమ భూములకు విముక్తి కలిగించాలని దామినేడు ప్లాట్ల సంక్షేమ సంఘం నేతలు అధికారులను కోరారు. నిషేధిత జాబితా నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలన్నారు.

పాఠశాలను తొలగించవద్దు


పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ చేసినట్లయితే ఉన్నత పాఠశాల మనుగడ సాధిస్తుంది.

1958వ సంవత్సరంలో మా గ్రామంలో రాజానగరం (పిచ్చాటూరు మండలం)లో ఎంపీపీ స్కూల్ ఏర్పాటు చేశారు. 1986లో ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 3, 4, 5 తరగతులను వేలూరు గ్రామానికి తరలించారు. తిరిగి మా

ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో బాధ్యతగా పనిచేయండి : ఎస్పీ


ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖపై ఎంతో నమ్మకంతో జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి విచ్చేసి తమ బాధలను, సమస్యలను ఆవేదన రూపంలో చెప్పుకోవడానికి వస్తున్నారు. అటువంటి వారి సమస్యలను బాధ్యతగా పట్టించుకుని పరిష్కరించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. ఆయా పోలీసు స్టేషన్లలో అధికారులు స్పందించని పక్షంలో అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. తిరుపతిలో సోమవారం ఎస్పీ నేతృత్వంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 102 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను ఎస్పీ ఎదుట ఏకరువు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, సీఐలు సాధిక్ ఆలీ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పర్ సీలేరుకు బయలుదేరిన తిరుపతి కబడ్డీ జట్టు


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తిరుపతి విద్యుత్ ఉద్యోగుల కబడ్డీ జట్టు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): అప్పర్‌సీలేరులో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ జట్టు బయలు దేరి వెళ్లినట్లు ఆ జట్టు మేనేజరు స్పోర్ట్స్ కార్యదర్శి లీలారామ్ తెలిపారు. అప్పర్ సీలేరులో రాష్ట్ర స్థాయిలో విద్యుత్ ఉద్యోగులకు కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఉంటాయని చెప్పారు. గత వారం రోజుల నుంచి జట్టు మేనేజరు టి.జయరామ్ అధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చారని కార్యదర్శి చెప్పారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తిరుపతి సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి తమ జట్టు ప్రథమ స్థానం సాధిస్తుందని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.

అన్నప్రసాద నాణ్యత ఎలా ఉంది?

● భక్తులతో మాట్లాడిన ఈవో, అదనపు ఈవో


భక్తుల అభిప్రాయం తెలుసుకుంటున్న ఈవో, అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాల నాణ్యత ఎలా ఉందంటూ టీటీడీ ఈవో శ్యామలరావు అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఆయన అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు. అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న కొందరు భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయలు తెలుసుకున్నారు. వీరూ భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీరించారు. తర్వాత కియోస్క్ మిషన్ ద్వారా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళమిచ్చారు. అన్నప్రసాద భవనంలోని క్యూలైన్లు, పరిశుభ్రత, ముడి సరుకుల నిల్వ గది తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్యాస్ ప్లాంట్‌నూ పరిశీలించారు. ఈకార్యక్రమంలో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'అమరరాజా'లో హరియాణా మాజీ డిప్యూటీ సీఎం


అమర్ రాజా పరిశ్రమలో మొక్కలు నాటుతున్న దుష్యంత్ సింగ్ చౌటాల

రేణిగుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలోని అమరరాజా పరిశ్రమను హరియాణా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌటాల సోమవారం సందర్శించారు. పరిశ్రమలోని పచ్చదనం అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అమరరాజా గ్రూప్ పరిశ్రమలు దేశంలో వ్యాపార మేధస్సు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రతీక అని కొనియాడారు. పరిశ్రమ లోపల పర్యావరణం, పరిరక్షణ, నాణ్యత ప్రమాణాలు, సమాజ అభివృద్ధి వంటి అంశాలలో అమర గ్రూప్స్ చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులునాయుడు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో వైభవంగా భాషోత్సవం

● శోభాయాత్రలో పాల్గొన్న వివిధప్రాంతాల ప్రతినిధులు


సదస్సులో ప్రసంగిస్తున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భాషోత్సవం పేరుతో రెండు రోజులపాటు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ సూచకగా యూనివర్సిటీలోని స్వామి నారాయణ అక్షర పురుషోత్తమ మండపం నుంచి సభా ప్రాంగణం దాకా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు భవనంలో నిర్వహించిన ప్రారంభ సభలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చాలా ప్రాధాన్యత గల అంశంపై ఉత్కల పీఠం జాతీయ సదస్సు నిర్వహించడం శుభ సూచకమన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. న్యూఢిల్లీకి చెందిన స్వామి నారాయణ సంప్రదాయ అక్షరధామ్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్ స్వామి మాట్లాడుతూ.. పురుషోత్తమ భాష్యం అనేది ప్రస్థాన త్రయానికి సంబంధించినది అన్నారు. అక్షర పురుషోత్తమ భాష్యం రాయడానికి మునుపు ఇందులోని గొప్పదనాన్ని తెలుసుకోవాలని కోరారు. యూజీసీ వైస్ ఛైర్మన్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం సామాజికంగా ఎంత అవసరమో ఆలోచించాలన్నారు. దీనిని సామాజిక ఔన్నత్యానికి అవసరమైన విధంగా రూపొందించాలని సూచించారు. ఐసీపీఆర్ సభ్యుడు సచ్చిదానంద మిశ్రా మాట్లాడుతూ.. సంస్కృత భాషలోనే కాకుండా, ఇతర భాషల్లోనూ ప్రస్థాన త్రయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయం వల్ల మానవ జీవన విధానం గొప్ప స్థితికి చేరుతుందని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం, క్రియాన్వయనం ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా ఎలా రూపొందించాలనే విషయంపై అవగాహన అవసరమన్నారు. గుజరాత్‌లోని సోమనాథ సంస్కృత వర్సిటీ వీసీ సుఖాంత్‌కుమార్ సేనాపతి మాట్లాడుతూ.. వేదాంతాది శాస్త్రాల్లో ప్రస్థాన త్రయానికి ఔన్నత్యం ఉందనీ, మంచి ఫలితాలు కూడా ఉన్నాయన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివ మూర్తి మాట్లాడుతూ.. వేద విజ్ఞానంలో ప్రస్థాన త్రయం గొప్ప ప్రాముఖ్యత కలదన్నారు. ఇందులోని విశేషాలను ఈ తరానికి అవసరమైన విధంగా విశ్లేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పండా, సలహాదారు ప్రొఫెసర్ శంకర నారాయణ, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

సీపీఐ జిల్లా ముగింపు సభలో మాజీ ఎమ్మెల్సీ విల్సన్



సభలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

సూళ్లూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సూళ్లూరుపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ జిల్లా రెండో మహాసభల ముగింపు సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ సీపీఐ పుట్టినప్పటి నుంచి కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటు చేస్తోందన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలయ్యిందని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకే మోదీ దేశాన్ని పాలిస్తున్నారని, ప్రజాస్వామ్యంబద్ధంగా ఏదీ జరగడం లేదన్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం నినాదంతో మత కలహాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ, అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసి పేదల కడుపుకొతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యహరించకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నేడు ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో కీలక భూమిక కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. అంతకుముందు సీపీఐ జిల్లా నాయకుడు మోదుగుల పార్థసారధి పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, చిన్నం పెంచలయ్య, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, శివారెడ్డి, జయలక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయాలకు 'సౌభాగ్యం'

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరిగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా టీటీడీకి చెందిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని 51 ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సౌభాగ్యవంతులకు గాజులు, పద్మావతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తక ప్రసాదాలు అందించనున్నారు. ఈ సందర్భంగా సుమంగళి ద్రవ్యాలను పంపిణీ చేసేందుకు ఓ అజ్ఞాత భక్తులు విరాళంగా అందించిన 8 లక్షల గాజులు, 1.40 లక్షల చొప్పున కంకణాలు, పసుపుదారాలు, కుంకుమ ప్యాకెట్లు, పుస్తకాలు ఆయా ఆలయాలకు పంపారు.

అమ్మవారికి కానుకగా 5వేల డజన్ల గాజులు


ఆలయాధికారులకు గాజులు, పసుపు కుంకుమ అందిస్తున్న దాత షణ్ముగం

తిరుచానూరు, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 8న జరగనున్న వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని స్థానికులైన సివిల్ ఇంజనీర్ షర్మిళ షణ్ముగం దంపతులు 5వేల డజన్ల గాజులు, పదివేల కంకణాలు, పదివేల పసుపు కుంకుమ ప్యాకెట్లను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయడు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ప్రత్యేక నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఇతడితో పాటు మరో 18 మంది మందుబాబులకు రూ.10 వేల వంతున రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు

రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్

పనపాకం వద్ద లారీ ఢీకొనడంతో ఇద్దరి మృతి


ప్రమాద స్థలంలో మృతదేహాలు

చంద్రగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం రాత్రి రాంగ్ రూట్‌లో వస్తున్న బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం తంబుగనిపల్లెకు చెందిన గడ్డం హరీష్‌నాయుడు(27), పరంధామ(33) బైక్‌పై చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ పనపాకం వద్ద రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీ కొంది. ఈప్రమాదంలో గడ్డం హరీష్‌నాయుడు, పరంధామ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందారు. పరంధామకు ఏడాది కిందటే వివాహమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక గవర్నర్



కర్ణాటక గవర్నర్ థావర్ చంద్‌గెహ్లాట్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ కుటుంబ సమేతంగా సోమవారం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. అలాగే హరియాణా రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్‌సింగ్‌చౌతాల, గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌లు కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, హేమాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ వర్సిటీలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



గుడుపల్లె, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలోని నూతన తరగతుల భవన సముదాయంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని సోమవారం ఇన్‌చార్జి వీసీ దొరస్వామి ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మూడు భాషల కూడలి ప్రాంతమైన కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ఎన్టీఆర్ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం ఉద్యోగులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్, డీన్ ఆచార్య శ్యామల, అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మన దేవాలయాలను మనమే కాపాడుకుందాం

- భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి



కమలానందకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మన దేవాలయాలను మనమే కాపాడుకుందామని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి పిలుపునిచ్చారు. హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం ఆయన తలపెట్టిన సంకల్పయాత్ర పులిచెర్ల మండలం మంగళంపేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు సోమవారం చేరుకోగా, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ప్రతి దేవాలయం ఆధ్యాత్మిక ధార్మిక సమాజసేవా కేంద్రంగా ఆవిష్కృతం కావాలన్నారు. మన సమాజాన్ని మనమే సేవించుకోవాలని, హిందూ ధర్మం పట్ల హిందూ యువత చైతన్యం కావాలన్నారు. ప్రతి దేవాలయంలో ఒక సేవా కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. గత నెల 12వ తేదీన ప్రారంభమైన ఈ హిందూ పరిరక్షణ చైతన్యయాత్ర ఏపీలో 9 జిల్లాలు, తెలంగాణాలో 4 జిల్లాల్లో కొనసాగుతుందని ఆయన తెలిపారు.

పిడుగుపాటుకు పేయదూడ మృతి



యాదమరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో మండలపరిధిలో పిడుగుపాటుకు పేయదూడ మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దళవాయిపల్లె పంచాయతీ నూరేనగర్ గ్రామానికి చెందిన రైతు ఖలందర్ గ్రామానికి సమీపంలో మేతకోసం తన పశువులను వదిలాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పేయదూడ సమీపంలో పిడుగు పడడంతో మృతి చెందింది. మృతి చెందిన పేయదూడను రెవెన్యూ, పశువైద్యశాఖ సిబ్బంది పరిశీలించారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ళ చిన్నారిపై ఓ వృద్ధుడు అత్యాచారానికి ప్రయత్నించిన సంఘటన గంగాధరనెల్లూరు మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు... వేపంజేరి పంచాయతీ పరిధిలోని ఓ ఆదిఆంధ్రవాడలో మేకలు మేపడానికి వెళుతున్న తల్లితో కలసి నాలుగేళ్ల చిన్నారి చెరకుతోట వద్దకు వెళ్లింది. కొంతదూరం వెళ్ళి ఆటలాడుకుంటుండగా వాసయ్య (62) అనే వృద్ధుడు ఆ చిన్నారిని దగ్గరకు తీసుకుని అత్యాచారానికి ప్రయత్నిస్తుండగా తల్లి గమనించి కేకలు వేసింది.దీంతో ఆ చిన్నారిని వదిలేసి వాసయ్య పారిపోయాడు.చిన్నారి తల్లి సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి బాధిత చిన్నారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

'పీఎం రాష్ట్రీయ బాలపురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి (పీఎం) రాష్ట్రీయ బాలపురస్కార్ 2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి వెంకటేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయస్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన 18 ఏళ్లలోపువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 15వ తేదీలోపు https\\awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు, రేపు స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలాదేవి మంగళ, బుధవారాల్లో జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జిల్లాలోని చౌకదుకాణాల్లో బియ్యం, చక్కెర పంపిణీ విధానం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసి.. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు వచ్చిన అర్జీలు 320

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ విద్యాధరి, ఇతర అధికారులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 320 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూకు 228, పోలీసులకు 9, పంచాయతీరాజ్‌కు 3, డీఈవోకు 5, డీఆర్‌డీఏకు 40, డ్వామాకు 6, ఏపీఎస్‌పీడీకి 3, మున్సిపాలిటీలకు 4, పశు సంవర్థకశాఖకు 8, నీటి వనరుల శాఖకు 4, సాంఘిక సంక్షేమం, ఎస్ఎస్, పౌర సరఫరాల శాఖ, ఎంపీడీవోలు, గురుకుల విద్యాలయాలకు 10 అర్జీల చొప్పున ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రధాన అర్జీలు ఇలా ఉన్నాయి.



మహిళ సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేయాలి



కలెక్టరేట్‌కు వచ్చిన వైసీపీ నేతలు

జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులను పంపిణీ చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ పరిశీలకుడు చావా రాజశేఖర్‌రెడ్డితో కలిసి చిత్తూరు, పూతలపట్టు, కుప్పం ఇన్‌చార్జులు విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, భరత్‌లు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు రైతులకు అనేక హామీలను ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యలపై తమ పార్టీ అధినేత జగన్ జిల్లాలో పర్యటిస్తేకానీ మామిడికి మద్దతు ధరను ప్రకటించలేదన్నారు. నేతలు జ్ఞానజగదీశ్, గాయత్రిదేవి, కేపీ శ్రీధర్, విజయసింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూమి ఆక్రమించారు



పాపిశెట్టిపల్లె గ్రామస్తులు

గ్రామ కంఠం సర్వే నెంబరు 2లో ఉన్న సుమారు 0.50 సెంట్ల భూమిని సుబ్రహ్మణ్యం నాయుడు, అతని కుటుంబీకులు ఆక్రమించుకుని పండ్ల మొక్కలు నాటుకున్నారని గుడిపాల మండలం మొగరాల పంచాయతీలోని పాపిశెట్టిపల్లె గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

హైకోర్టు ఆదేశాలను పాటించేలా చూడండి

'కాణిపాకం పంచాయతీకి చెందిన శ్మశాన భూమిపై అప్పట్లో ఎండోమెంట్ ఈవో కోర్టు వేశారు. పంచాయతీకి అనుకూలంగా తీర్పు వచ్చినా ఎండోమెంట్ అధికారులు, రెవెన్యూ అధికారులు పంచాయతీకి భూమిని అప్పగించడం లేదు' అని కాణిపాకం మాజీ సర్పంచ్ గోపినాథ్, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఆదేశాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్వాక్రా సంఘాన్ని రద్దు చేయాలని బెదిరింపు

రుణం సరిగా చెల్లించక పోవడంతో ఇద్దరు సభ్యులను తమ సంఘం నుంచి తొలగించామని పెనుమూరు మండలం కత్తిరెడ్డిపల్లెకు చెందిన మహాలక్ష్మీ మహిళా సంఘం సభ్యులు తెలిపారు. ఆ ఇద్దరు తమను రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల మాటలు విన్న వీవో కూడా సంఘాన్ని రద్దు చేసుకోవాలని బెదిరిస్తున్నారని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

జీవనోపాధి కల్పించండి

బాతులు మేపుకునే వృత్తిలో విపరీతమైన నష్టాన్ని చవిచూశామని, స్థిరమైన నివాసం, జీవనోపాధిని కల్పించాలని సదుం మండలం ఎరుకులపురం గ్రామస్తులు కోరారు. అప్పులు తీసుకున్న వారికి వడ్డీలు కట్టలేక భయంభయంగా జీవిస్తున్నామన్నారు.

పోలీసు కార్యాలయానికి 55 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 55 అర్జీలు అందాయి. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు వినతిపత్రాలను స్వీకరించారు. వచ్చిన అర్జీల్లో.. భూ తగాదాలపై 21, డబ్బు తగాదాలపై 10, కుటుంబ తగాదాలపై 9, ఆస్తి తగాదాలపై 5, వేధింపులపై 4, దారి సమస్యలపై 4, గొడవలపై 2 చొప్పున ఉన్నాయి.

నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సత్యకుమార్



ఈడిగపల్లె వద్ద విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్ వెల్లడించారు.త్వరలో వంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవన వసతి కల్పించడానికి రూ.194 కోట్లతో పనులు చేపడతామని చెప్పారు.కార్వేటినగరం మండలం ఆలత్తూరు పంచాయతీ ఈడిగపల్లి వద్ద రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటి పరిశీలనకు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మెడికల్ ఆఫీసర్ వద్దకు అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్యం అందించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా 14 రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు 105 రకాల మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సీహెచ్‌సీలకు అవసరమైన భవన వసతి నిర్మాణ పనులను వేగవంతం చేయిస్తామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు.డీఎంహెచ్‌వో సుధారాణి,ఆర్డీవో అనుపమ,సర్పంచ్ పుష్పాంజలి, డాక్టర్లు భువనేశ్వరి, హేమశ్రీ, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ , యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, టీడీపీ మండల అధ్యక్షులు చెంగల్రాయయాదవ్, గంధమనేని జయశంకర్‌నాయుడు, స్వామిదాస్, రుద్రప్పనాయుడు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌నాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, సీనియర్ నాయకులు చిట్టిబాబు, కాపు సేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు న్యాయం కోసం తిరిగి విసిగి వేసారిపోయిన ఓ రైతు సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు యత్నించాడు. రైతు భార్య శ్యామలమ్మ కథనం మేరకు.. వి.కోట మండలం నడమంత్రం గ్రామానికి చెందిన చౌడప్పకు ప్రభుత్వం గతంలో రెండెకరాల భూమిని ఇచ్చింది. ఈ భూమితో పాటు మరో ఒకటిన్నర ఎకరా ఆయన కుటుంబానికి ఉంది. అదే గ్రామానికి చెందిన రామకృష్ణప్ప గౌడ్ ఆ భూమిలో ఎకరం భూమి వరకు ఆక్రమించాడంటూ వి.కోట తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కొన్నేళ్లుగా చౌడప్ప తిరుగుతున్నాడు. అయితే ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నేతలతో రామకృష్ణగౌడ్ సఖ్యతగా ఉంటుండడంతో చౌడప్ప ఫిర్యాదును రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. నాలుగు నెలల నుంచి నెలకోమారు కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు హాజరై చౌడప్ప వినతిపత్రాన్ని ఇస్తూ వస్తున్నాడు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నాడనే కోపంతో రామకృష్ణగౌడ్ మరింత భూమిని ఆక్రమించుకోగా.. గ్రామస్తులు కూడా సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన చౌడప్ప కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అర్జీ ఇవ్వగా, అక్కడే ఉన్న జేసీని కలవాలని ఆయన సూచించారు.దీంతో అప్పటికే అసహనంతో ఉన్న చౌడప్ప తన బ్యాగులో అప్పటికే తెచ్చుకున్న పురుగుల మందును తాగేశాడు.వెంట వున్న ఆయన భార్య శ్యామలమ్మ కేకలు పెట్టడంతో అప్రమత్తమైన పోలీసులు చౌడప్పను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది.కాగా ఈ విషయమై వి.కోట రెవెన్యూ అధికారులను విచారించగా వారి కథనం ప్రకారం.... చౌడప్ప తండ్రికి రామకృష్ణప్ప గౌడ్ పూర్వీకులు రెండెకరాల భూమిని ఇచ్చారు.ఆ భూమితో పాటు పక్కనే వున్న 69సెంట్ల భూమి కూడా తనకే చెందుతుందని చౌడప్ప వాదిస్తున్నాడు.అయితే ఆ 69సెంట్ల భూమి రికార్డు రామకృష్ణప్ప గౌడ్ కుటుంబీకుల పేరుతో వుంది.చౌడప్ప తన భూమిలోకి పోవాలంటే ఈ 69సెంట్ల భూమి గుండానే వెళ్లాలి.పంటలు సాగు చేసినప్పుడు ఆ దారిలో వెళ్లరాదని రామకృష్ణప్ప గౌడ్ కుటుంబీకులు అభ్యంతరం చెబుతుండడంతో వివాదంగా మారింది.ఈ విషయమై ఊరి పెద్దలు ఇద్దరూ చెరిసగం భూమి తీసుకోవాలని సూచించారు.అయితే దానికి ఇష్టపడని చౌడప్ప రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.ఈ విషయమై గత ఏడాది కూడా గొడవ జరిగితే ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.



పురుగుల మందుతాగిన చౌడప్ప వద్ద భార్య శ్యామలమ్మ

ఎస్వీయూలో భద్రతా శిక్షణ కేంద్రం

- కార్మిక శాఖతో ఎస్వీయూ ఒప్పందం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖతో ఎస్వీయూ అవగాహన ఒప్పందం చేసుకుంది. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కమిషనర్ శేషగిరిబాబుతో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం విజయవాడలో సమావేశమై అవగాహన ఒప్పందంపై చర్చించి, సంతకాలు చేశారు. ఎస్వీయూలో భద్రతా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. పరిశ్రమల్లోని భద్రతా సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఈ కేంద్రం ద్వారా అందించనున్నారు. కంపెనీ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌పై యూనివర్సిటీలో ఒక కోర్సును కూడా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారం ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ సీడీసీ డీన్ చెంగ్రాయుడు పాల్గొన్నారు.

ఆపిల్ షోరూంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఆప్కో షోరూంలో దొంగలు పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ రైటర్ భానుప్రసాద్ వివరాల మేరకు.. గాంధీరోడ్డులోని ఆప్కో షోరూంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగులగొట్టి రూ.43వేలు అపహరించారు. ఆదివారం ఉదయం షోరూం తెరవడానికి వచ్చిన మేనేజర్ శ్రీనివాసులు షట్టర్ తాళం పగులకొట్టి ఉండడం గమనించి లోనికెళ్లి పరిశీలించారు. చిన్న బీరువాలో ఉంచిన రూ.43 వేలు కనిపించలేదు. వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పుంగనూరు రోటరీక్లబ్‌కు బహుమతులు



బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ శ్రీధర్

పుంగనూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో పుంగనూరు రోటరీ క్లబ్ ప్రతిభ కనబరించి బహుమతులు అందుకున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు నానబాల గణేష్ తెలిపారు. ఆదివారం కర్నాటక రాష్ట్రం బెంగళూరులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో శ్రీకాళహస్తి నుంచి మైసూర్ వరకు వివిధ పట్టణాల నుంచి దాదాపు 100మంది క్రీడాకారులు వచ్చి పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఈ పోటీల్లో పుంగనూరు రోటరీక్లబ్ సభ్యులు ప్రతిభ కనబరించి రోటరీ డిస్ట్రిక్-3191, 3192 గవర్నర్లు శ్రీధర్, ఎలిజిబెత్ చరియాన్‌ల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుంగనూరు రోటరీ క్లబ్ కార్యదర్శి పీఎస్ రాజారెడ్డి, సభ్యులు భాస్కర్‌జెట్టి, అనిల్, ఆవుల హరిప్రసాద్, మునిరాజ, అర్షద్‌అలీ, సత్యాచారి, ఖలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో 80.2 మిమీ వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 10 మండలాల్లో తేలికపాటి నుండి భారీవర్షం కురిసింది. మండలాలవారీగా విజయపురంలో 80.2మిమీ, పుంగనూరులో 52.4, చౌడేపల్లెలో 40.2, సోమలలో 24.2, రామకుప్పంలో 18.2, వి.కోటలో 16.2, నింద్రలో 11.2, కుప్పంలో 3.2, గుడుపల్లెలో 2.8, శాంతిపురంలో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి



ప్రజల సమస్యలను వింటున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల సచివాలయంలోని సమావేశపు గదిలో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు వివిధ రకాలైన సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యల గురించి విన్న కడా పీడీ వాటిపై ఆయా శాఖల అధికారులను వివరాలు ఆరా తీశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సీఎం చంద్రబాబు నేరుగా కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని, సమస్యల పరిష్కారాన్ని పర్యవేక్షిస్తున్నారని గుర్తుచేశారు. ఎవరైనా బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా సీఎంఆర్ఎఫ్: ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) ఆపన్నులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌లు తెలిపారు. సోమవారం రామకుప్పంలో జరిగిన కార్యక్రమంలో రామకుప్పంకు చెందిన సుబ్రహ్మణ్యంకు రూ.60,000, బైపరెడ్లపల్లెకు చెందిన సునీతకు రూ.40,705, 89పెద్దూరుకు చెందిన కళావతికి రూ.40,000 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారు పంపిణీ చేశారు.

రెవెన్యూ రికార్డులు తారుమారు
● తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘ నాయకులు

పెద్దపంజాణి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డులు తారుమారు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నాయకులు సోమవారం పెద్దపంజాణి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్దపంజాణి మండలంలోని రాజుపల్లె గ్రామానికి చెందిన ఎరుకుల మంగమ్మకు చెందిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని, వాటిని సరిచేసి న్యాయం చేయాలని మంగమ్మ పలుమార్లు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో దళిత సంఘ నాయకులను ఆశ్రయించింది. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శన్ ఆధ్వర్యంలో దళిత సంఘ నాయకులు స్థానిక ఇన్చార్జ్ తహసీల్దారు రమేష్‌బాబుకు వినతిపత్రం అందించి ధర్నా చేశారు. మంగమ్మ రెవెన్యూ రికార్డులను సరిచేయాలని, రికార్డులను తారుమారు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు ఉపాధ్యక్షుడు గుండ మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యమలా చంద్రయ్య, అశోక్, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య, మండల అధ్యక్షులు మంజునాథ్, దళిత సంఘ నాయకులు గార్గేయ, శివన్న, నాగరాజ, చంద్ర, గంగులప్ప, రెడ్డెప్ప, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం



ఈవో కమలాకర్‌కు విరాళం అందజేస్తున్న సరోజమ్మ

పలమనేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గోపుర నిర్మాణానికి, ఆలయ అభివృద్ధికి పలమనేరుకు చెందిన లేట్ ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం సతీమణి విశ్రాంత ఉపాధ్యాయిని సరోజమ్మ రూ.లక్ష విరాళాన్ని సోమవారం ఈవో కమలాకర్‌కు అందజేశారు. సరోజమ్మతో పాటు పుష్పాల వెంకటేశ్వర్లు రూ.5,116లు, దివంగత విశ్రాంత పంచాయతీ ఈవో పి.రామ్మోహనరావు సతీమణి కృష్ణవేణి రూ.5,116లు ఈవో కమలాకర్‌కు అందజేశారు. దాతలకు ఈఓ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు హరీష్ , ఆలయ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి పలువురు భక్తులు పాల్గొన్నారు.

పాలేటమ్మకు పొంగళ్లు

సోమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మ ఆలయంలో సోమవారం సిద్ధభగిత పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్ళు, పిండి దీపాలతో బాణసంచా వేడుకలతో ఉపవాసదీక్షలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించుకున్నారు. ఉదయం బలిపోతును అమ్మవారికి బలిదానం చేసి, బలిహరణను పంట పొలాల్లో చల్లి పంటలు సుభిక్షంగా పండాలని మొక్కుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు జంతు బలులు జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ సమీపంలోని బావి వద్దకు మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లి జలాభిషేకం నిర్వహించి పాలేటి ఉత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ఆసాదివారిచే కల్లు పాట నిర్వహించారు. అమ్మవారి వేషధారణలోని పాలేటి పూజారికి భక్తులు పూజలు చేసి కానుకలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త సాకిబండ నరసింహులు, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



కుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం తంబిగానిపల్లెకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ బలరాముడు అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ఆర్టీసీ సంస్థ తరఫున రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆర్టీసీ డిపో అధికారులు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, ఆర్ముగం, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభలను జయప్రదం చేయండి

పుంగనూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9, 10వ తేదీల్లో నగిరిలో జరిగే సీపీఐ 24వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అయ్యలరాజు భవన్‌లో జరిగిన 11వ పట్టణ సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు విస్మరిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పోరాటానికి సిద్ధం కావాల్సివుందన్నారు. నాయకులు టి.జనార్ధన్, కవిత, రామమూర్తి, మున్నా, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పలమనేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్టు లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేసులు కోరారు. కళాశాలలో రెండు కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీ, యూజీసీనెట్, ఏపీసెట్ విద్యార్హత ఉన్నవారు అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆగస్టు 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని శివాలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా వారణాశివారిపల్లెకు చెందిన రజిత శ్రీనివాసులు దంపతులు వ్యవహరించారు. పూజారి మునిరాజశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సోమల మండలంలో మోస్తరు వర్షం



పెద్దఉప్పరపల్లె సమీపంలో ఇంద్రధనుస్సు

సోమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో సోమవారం సాయంత్రం 4గంటలకు ఓ మోస్తరు వర్షం కురిసింది. పెద్ద ఉప్పరపల్లె వద్ద ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు పలువురిని ఆకర్షించింది. మూడ్రోజులుగా ఎండలు వేసవిని తలపించాయి. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మండలంలో వర్షాభావంతో పలుచోట్ల వరి నాట్లు వేయడంలో జాప్యం జరుగుతుంది. కాగా సోమలలో ఆదివారం రాత్రి 24.2 వర్షం నమోదైంది. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పేటూరు తదితర చోట్ల వర్షం కురిసింది.

వి.కోటలో భారీ వర్షం

వి.కోట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వి.కోటలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటలకు చిరుజల్లులతో మొదలైన వాన క్రమేపీ పుంజుకుని గంట పాటు ఎడతెరపిలేకుండా కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత జూలై మాసంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ సాగు కోసం ఎదురు చూస్తున్న రైతులు దుక్కులు దున్నేందుకు సమాయత్తమయ్యారు. మూడు రోజులుగా వేసవిని తలపించే రీతిలో ఎండలు దంచేయడంతో ఉక్కపోతకు జనం అల్లాడారు. సోమవారం సైతం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడటంతో జనం ఉపశమనం పొందారు.

డీటీగా రామ్మూర్తి బాధ్యతల స్వీకరణ

చౌడేపల్లె, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్‌గా రామ్మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పంలో పనిచేస్తున్న తనను చౌడేపల్లె డీటీగా కలెక్టర్ బదిలీ చేయటంతో బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుల్లవారిఇండ్లలో నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయాన్నే వేదపండితులతో శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

సోమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి వీఆర్వోలు ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజల నుంచి అందిన అర్జీలను స్వీకరించారు. సమస్యలను, భూవివాదాలను క్షేత్రస్థాయి సందర్శనలతో ఇరువర్గాల సమక్షంలో పరిష్కరించాలన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా



తహసీల్దార్ పార్వతితో మాట్లాడుతున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి సోమవారం ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ పార్వతిని ఆరా తీశారు. అలాగే పశువైద్యాధికారి పవన్‌కుమార్‌ను, ఉపాధి హామీ సిబ్బందిని గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమౌళి, వెంకటరమణ, కుమార్‌రెడ్డి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు సీఐగా జయరామయ్య బాధ్యతల స్వీకరణ



కల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కల్లూరు సీఐగా ఎం.జయరామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సూర్యనారాయణ చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ కాగా, ఈయన చిత్తూరు వీఆర్‌లో సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీఐకి ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

పలమనేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మొరంలో తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఎంఎస్‌కె.నవనీత, అంగన్‌వాడీ వర్కర్లు రెడ్డెమ్మ, రేవతి, నిర్మల, జ్యోతెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆ హామీల అమలేదీ: వైసీపీ

సదుం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు ప్రజలకు హామీలిచ్చి నెరవేర్చలేదని వైసీపీ నాయకులు ప్రజలకు వివరించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు ప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనంజయరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్ పాల్గొన్నారు.

సహకార బ్యాంకులతో అన్నదాతల అభివృద్ధి
● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్స సభలో మాట్లాడుతున్న శ్రీకాంత్

శాంతిపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార బ్యాంకుల సహకారంతో అన్నదాతలను అభివృద్ధి పరచాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబులు అన్నారు. సోమవారం శాంతిపురం సింగిల్ విండో త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారోత్సవ సభను సహకార బ్యాంకు ఆవరణలో నిర్వహించారు. ఈ సభలో వారు మాట్లాడుతూ అర్హులైన రైతులకు సహకార బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి అండగా నిలవాలన్నారు. కొత్త కమిటీ బ్యాంకు అభివృద్ధికి సహకరించాలన్నారు. రైతులకు సకాలంలో రుణాలు ఇస్తూ అదే తరహాలో రుణాల రికవరీ చేయాలన్నారు. శాంతిపురం మండలంలో నాయకులు విబేధాలు పక్కన పెట్టి కలిసి మెలసి పని చేస్తూ ప్రజా సేవకు అంకితం కావాలన్నారు. అంతకు ముందు మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు బస్టాండ్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేసి నివాళులర్పించారు. బాణసంచా పేలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. సింగిల్ విండో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు చేరుకొని ప్రసంగించారు. అనంతరం గోపాల్ చైర్మన్‌గా, సభ్యులుగా దాము, హరిష్‌కుమార్‌లు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ గోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సింగిల్ విండో చైర్మన్ బాధ్యతను కట్టబెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నంకు, డాక్టర్ సురేష్‌బాబుకు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులు, బ్యాంకు అభివృద్ధికి సభ్యులతో కలిసి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, క్లస్టర్ ఇంచార్జి రాజేంద్ర, యూనిట్ ఇంచార్జిలు బాలు, పెద్దన్న, నారాయణస్వామి, శేఖర్, నేతలు విజయకుమార్, కేశవులు, సింగల్ విండో సీఈవో శివారెడ్డి, సిబ్బంది, కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ అనసూయ, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల, హేమా, పోలారాణి, బసవరాజు, మురళీ, జనసేన నేతలు కిషోర్, వేణు, ధనుష్, మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు, జనసైనికులు తదితరుల పాల్గొన్నారు.

వరి సాగుకు రైతుల సన్నాహాలు



బెస్తపల్లి వద్ద పొలాల్లో వరినాట్లు వేస్తున్న మహిళలు

రొంపిచెర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షాలతో అక్కడక్కడ కుంటలు, చెరువులలో నీరు చేరడంతో రైతులు ఖరీఫ్ వరి సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో ముందుగా బోరుబావులు ఉన్న రైతులు వరి విత్తనాలు శుద్ధిచేసి నారుమడ్లలో 40 హెక్టార్లలో పైర్లు సిద్ధం చేశారు. గతంలో ఎద్దులతో పొలం దున్నకాలు చేసేవారు. కాలక్రమేణ మడకలతో దున్నకాలు తగ్గి ట్రాక్టర్లతో దుక్కులు చేస్తున్నారు. ఈఏడాది ఖరీఫ్ కింద మండలంలో 794 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు జరగాల్సి ఉందని ఏవో శ్రావణి తెలిపారు. ఇప్పటికే 22 హెక్టార్లలో వరి సాగు చేశారని, దీనికి సంబంధించి రైతులు తీసుకోవాల్సి చర్యల గూర్చి పొలంబడి కార్యక్రమాలలో సూచనలు ఇచ్చామన్నారు.

ఎట్టకేలకు కాలనీ వాసులకు చౌకదుకాణం



గంటావూరులో ఏర్పాటుచేసిన చౌకదుకాణం నుంచి సరుకులు తీసుకొని హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

పలమనేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పలమనేరు గంటావూరు ఇందిరమ్మ కాలనీలో చౌకదుకాణం ఏర్పాటు చేయడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు సుమారు 3వేల మందికి నివేశస్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. పేదలైన ఈకాలనీ వాసులకు నిత్యావసర సరుకుల కోసం చౌకదుకాణం లేకపోవడంతో గత రెండు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి సమస్యను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కాలనీ వాసుల కోసం చౌకదుకాణాన్ని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు కాలనీలోనే చౌకదుకాణం ఏర్పాటుచేసి బియ్యం, చక్కెర పంపిణీ చేస్తుండటంపట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వారు కృతజ్ఞతలు చెప్పారు.

కుప్పం నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి

గుడుపల్లె, ఆగస్టు 4(ఆంధజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణగిరి క్షేత్రమైన మల్లప్ప కొండలో ఆలయ నిర్మాణానికి శ్రీకాంత్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ... కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఉన్న ఆలయాల నిర్మాణం కోసం నిధులు విడుదల అయ్యాయని, త్వరలో ఆలయాల నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండలాధ్యక్షులు బాబు నాయుడు, సీఎం మాజీ పీఏ మనోహర్, మాజీ ఎంపీపీ మునిరాజు, జనసేన మండలాధ్యక్షుడు అమీర్, బేటప్పనాయుడు, రమేష్, హేమాంబర్ గౌడ్, మంజునాథ్, వెంకటేష్, బాబు, భానుమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సులోచన రంగనాథ్ దంపతులు

వి.కోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో వెలసిన నగరీశ్వరస్వామి పురాతన దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్థులు సోమవారం భూమిపూజ చేశారు. పురాతన ఆలయాన్ని తొలగించి, అదే స్థలంలో నూతనంగా నిర్మించేందుకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నవగ్రహ పూజ, వాస్తు పూజ, గణపతి హోమం, కలశస్థాపన చేపట్టారు. సోమవారం తెల్లవారు జామున ఆలయ పునర్నిర్మాణానికి మాజీ ఎంపీపీ సులోచనా రంగనాథ్ దంపతులు, పట్టణ ప్రముఖులచే ప్రత్యేక పూజల అనంతరం భూమిపూజ చేపట్టారు. పలువురు దాతలు ఆలయ నిర్మాణ నిమిత్తం విరాళాలను నిర్మాణ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ తుకారం, గంగాధరం, చంద్రశేఖర్, మురుగేష్, శ్రీనివాసులు, శంకర, మోహన్, మంజుళమ్మ, నాగభూషణం, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పట్ల అశ్రద్ధ వద్దు

కల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం పట్ల అశ్రద్ధ చూపవద్దని ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సమాచార హక్కు చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలకు సంబంధించిన వివరాల గురించి ఎవరైనా సమాచారహక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారికి నిర్ణీత సమయంలోపు వివరాలు తప్పక ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మునిరాజ, డిప్యూటీ ఎంపీడీవో హరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయ, ఆర్ఎస్కే సిబ్బంది



పెంగరగుంటలో సోమవారం ఉదయం 11 గంటల వరకు కూడా తెరుచుకోని సచివాలయం, ఆర్ఎస్కే

పలమనేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం పెంగరగుంట గ్రామ సచివాలయ సిబ్బంది, రైతు సేవా కేంద్రా (ఆర్ఎస్కే)ల్లో పనిచేసే సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సోమవారం కూడా ఉదయం 11గంటల వరకు ఈ కార్యాలయాలు తెరచుకోకపోవడంతో రైతు సంఘ నాయకులు ఉమాపతి నాయుడు, సర్పంచ్ భర్త నక్షత్రయ్య, మరికొందరు రైతులు ఎంపీడీవో భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఇకనైనా ఈ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

పలమనేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు పెద్దఎత్తున నినాదాలు చేశారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ వర్కర్లు తమకు శాఖాపరంగా ఇచ్చిన కాలం చెల్లిన ఫోన్లు వద్దంటూ వాటిని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డికి అందజేశారు. ఎఫ్ఆర్ఎస్ రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. సమస్యలపై చర్చించడానికి అంగన్వాడీ యూనియన్లను చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించాలని, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ అనుబంధ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీఆర్ జ్యోతి డిమాండు చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు గిరిధరగుప్తా, మూడు సంఘాలకు సంబంధించిన వర్కర్లు మొబైల్స్‌ను కార్యాలయంలో అందజేశారు. సీఐటీయూ నుంచి పద్మ, అనసూయ, భారతి, అంగన్వాడీ వర్కర్లు హాజరయ్యారు.


బైక్‌ను ఢీకొన్న కారు
● తండ్రీకుమార్తెకు తీవ్రగాయాలు

పూతలపట్టు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో తండ్రీకుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. సదుం మండలం చీకలచేను గ్రామానికి చెందిన రామమూర్తి తన కుమార్తె విమలతో కలిసి పని నిమిత్తం చిత్తూరుకు సోమవారం వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా పూతలపట్టు మండలంలోని రంగంపేట క్రాస్ సమీపాన ఫ్లైవోవర్ వద్ద వెళ్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీ కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన మహాభారత యజ్ఞం

సోమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం ధర్మరాజు పట్టాభిషేకంతో యజ్ఞ కార్యక్రమాలు ముగిశాయి. పంచపాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త పి.శ్రీనివాసులు అభిషేక పూజలు జరిపారు. ఉభయదారులను, భాగవతారిణి గీతాశ్రీని, నాటకమండలి సభ్యులను ఆలయ ధర్మకర్త సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, బాలకృష్ణమనాయుడు, రెడ్డెప్ప, సుబ్బరాయులు, విశ్వనాథం, శ్రీకాంత్, పాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయంటూ మహిళల నిరసన



ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు, మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నక్కబండ వాసులు

పుంగనూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మురుగుకాల్వల నుంచి వెలువడే మురుగు నీరు ఇళ్ల ముందు నిలిచిపోవడం, కొద్దిపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు వస్తున్నాయని నక్కబండ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పలువురు మహిళలు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నక్కబండలోని తాజ్‌నగర్ 1వ వీధిలో వర్షం కురిస్తే మురుగు నీరు ఇళ్ల ముందు చెరువులను తలపిస్తుందని, దుర్వాసన వెదజల్లడంతో పాటు ఇళ్లలోకి వస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్మించిన కాల్వలకు అడ్డంగా మట్టి వేయడంతో నీరు వీధుల్లోకి వస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బందికి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాల్వలకు అడ్డంగా మట్టి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అట్టహాసంగా రామకుప్పం సింగిల్‌విండో
త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



రామకుప్పంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

రామకుప్పం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రామకుప్పం సింగిల్‌విండో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. టీడీపీ శ్రేణులు ఉదయం 11.30 గంటలకు చైర్మన్ మహ్మద్‌రఫీ, డైరెక్టర్లు సురేష్, ఆంజప్పలను స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి డప్పుల హోరు, బాణసంచా పేలుళ్ళ మధ్య బజారువీధి గుండా ర్యాలీగా సింగిల్ విండో కార్యాలయానికి తీసుకువచ్చారు. పూజా కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సింగిల్‌విండో సీఈవో కోదండ చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, టీడీపీ, జనసేన మండల నేతలు వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఇతర వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం ఎన్టీయార్ సింగిల్‌విండోలను ఏర్పాటు చేశారన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు అన్ని విధాలా అండగా నిలిచి, రామకుప్పం సింగిల్‌విండోను రాష్ట్రంలోనే ఆదర్శవంతగా తీర్చిదిద్దాలనికోరారు. చిరువ్యాపారులకు సింగిల్‌విండో ద్వారా విరివిగా రుణాలిచ్చి ఆదుకోవాలన్నారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వట్ర నారాయణాచారి, టీడీపీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, జనసేన మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరీష్, భాస్కర్, నేతలు రాజకుమార్, అంజనేయరెడ్డి, చలపతి, చిన్నికృష్ణ, రామ్మూర్తి, గుర్రప్ప, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, నరసింహులు, జయశంకర్, సత్తి, విశ్వనాథ్, వెంకటాచలం సలాంసాబ్, రామకృష్ణప్ప, అవినాశ్, నందారెడ్డి, వెంకటరమణ, టీవీరవి, మంజునాథ్, విజయ్‌కుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, మనోహర్, గజేంద్ర, రవిరెడ్డి, నాగభూషణం, కామరాజనాయక్, నవీన్, రఘు, భూపతి, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో మంత్రి, విప్



అమ్మవారి ఆలయంలో మంత్రి సత్యకుమార్, విప్ థామస్ తదితరులు

వెదురుకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పసలవానిమిట్ట వద్ద ఉన్న ఆరిమేని గంగమ్మను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ సోమవారం దర్శించుకున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తర్వాత అక్కడ ప్రజలతో మాట్లాడి.. సమస్యలను తెలుసుకున్నారు. పలువురు అర్జీలను సమర్పించారు.

రంగునీటి సమస్యను పరిష్కరించండి

● ఆరోగ్యశాఖ మంత్రికి నగరి వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

నగరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని రంగునీటి సమస్యను పరిష్కరించాలని నగరి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వీటీ భాస్కర్, రమేష్‌నాయుడు, వెంకటేశ్వర్లు, బాబు తదితరులు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం కార్వేటినగరం యువరాజు ఇంటి వద్ద మంత్రిని కలిసి డైయింగ్ యూనిట్లతో వచ్చే రంగునీటి వల్ల ఏర్పడిన కాలుష్యాన్ని వివరించారు.

మంత్రిని కలసిన నింద్ర బీజేపీ నాయకులు

నింద్ర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను పుత్తూరులో సోమవారం నింద్ర మండలం బీజేపీ నాయకులు కలిశారు. వీరిలో కడియం బాలకృష్ణ, వేణు తదితరులు ఉన్నారు.

కోసలనగరం పీఏసీఎస్‌కు ప్రశంస



విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఛైర్మన్, సీఈవో

విజయపురం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం పీఏసీఎస్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక లావాదేవీల్లో ఉత్తమ ప్రతిభ చూపింది. దీనికిగాను సోమవారం విజయవాడలో పీఏసీఎస్ ఛైర్మన్ బాబుయాదవ్, సీఈవో చంద్రమోహన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ ఛైర్మన్ రామాంజనేయులు ప్రశంసాపత్రం అందించారు. డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, సీఈవో శంకర్‌బాబు, టీడీపీ నాయకులు ఉమాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'వినాయక చవితి'కి విస్తృత ఏర్పాట్లు చేయాలి

● అసిస్టెంట్ కమిషనర్‌కు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల వినతి



ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు కట్టమంచిచెరువులో విస్తృత ఏర్పాట్లు చేయాలని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కార్యక్రమంలో సభ్యులు రామభద్ర, వెంకటేశ్, షణ్ముగం, గోకుల్, జ్యోతి, సునీల్ తదితరులు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌కు ఈ మేరకు వినతి పత్రాన్ని ఇచ్చారు. అలాగే నగరం నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఏసీ అర్జీలను స్వీకరించారు. సోమవారం ఎనిమిది అర్జీలు రాగా.. ఇంజనీరింగ్‌కు 3, పింఛన్‌కు 3, ప్రజారోగ్యశాఖకు ఒకటి, తల్లికి వందనానికి ఒకటి చొప్పున ఉన్నాయి. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



పాలసముద్రం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతల సహకారంతో నోటు పుస్తకాలను వితరణ చేశారు. పాలసముద్రం ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన సమావేశంలో పారిశ్రామికవేత్త కె.బాబు రాజు, ఆడిటర్ మోహన్‌రాజు సహకారంతో రూ.50వేల నోటు పుస్తకాలను ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందించారు. ఎంపీపీ శ్యామలాశివప్రకాష్‌రాజు, ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, గిరిజ, హెచ్ఎం మీనాక్షి, ఉపాధ్యాయులు స్వామిరాజు, దేవయ్య, ధనరాజ్, కోదండయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు స్థల పరిశీలన



స్థల పరిశీలనకు వచ్చిన అధికారులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సింధురాజపురం సమీపంలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన స్థలం, రూట్ మ్యాప్‌ను రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ సుబ్బారావు సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎస్ఆర్‌పురం మండల పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు వనరులు బాగున్నాయని సుబ్బారావు చెప్పారు. తహసీల్దార్ లోకనాథం పిళ్ళై, సర్వేయర్ సురేష్ బాబు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నగరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ బాలాజీ, దేశమ్మ గుడి మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ హరిబాబు, గోవిందరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి పట్టాలివ్వండి: సీపీఐ



బాధితులతో కలిసి తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

నగరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇంటి పట్టాలివ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నగరి మండల పరిధిలోని తెరణి దళితవాడ వాసులు నివాసం ఉన్న స్థలాలకే ఇంటి పట్టాలిప్పించాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, గ్రామ కమిటీ నాయకులు తంగరాజన్, నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, నాయకులు సుబ్రహ్మణ్యం, ఏసయ్య, రవి, కన్నన్ శ్యామల, పలువురు దళితులు పాల్గొన్నారు.

నగరంలో చిరు జల్లులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం విడతలవారీగా చిరుజల్లులు కురిశాయి. ఈ సందర్భంగా రోడ్లన్నీ చిత్తడిని తలపించాయి, పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నాలుగైదు దఫాలుగా చిరుజల్లులు కురిశాయి.

'ప్రకృతి సేద్యం' కూరగాయలతో ఆరోగ్యం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయల వినియోగంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సబ్‌డివిజనల్ యాంకర్ హేమవతి, డీఎంఎంటీ ధనలక్ష్మి అన్నారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ వద్ద సోమవారం ప్రకృతిసేద్యంతో పండించిన కూరగాయలను ప్రదర్శన, విక్రయాలు నిర్వహించారు. ప్రకృతిసేద్యం సభ్యులు కళావతి, భానుమతి, రామేశ్వరి, గణపతి పాల్గొన్నారు.

ఈ గుంతను పూడ్చండి



కొల్లాగుంట చెక్ పోస్టు కూడలిలో రహదారిపై గుంత

వెదురుకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు కూడలిలోని జాతీయ రహదారిపై గుంత ఏర్పడింది. దీన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ గుంతను పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

భక్తులకు రుచికరమైన లడ్డూలను అందించండి

వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్



లడ్డూ తయారీకి వాడే బూందీని పరిశీలిస్తున్న పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి విచ్చేసే భక్తులకు రుచికరమైన లడ్డూ ప్రసాదాన్ని అందించాలని ఈవో పెంచలకిషోర్ అన్నారు. సోమవారం ఆలయ లడ్డూ పోటును తనిఖీ చేశారు. భక్తులకు సరిపడా లడ్డూలను తయారు చేసి, శుభ్రంగా అందించాలని సూచించారు. బరువు, రుచిలో తేడా రాకుండా అధికారులు నిత్యం పరిశీలిస్తుండాలని చెప్పారు. విక్రయ కేంద్రాల్లో లడ్డూల కొరత రాకుండా చూడాలన్నారు. డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రోడ్డులోని హజరత్ సయ్యద్ షాగులాం రసూల్ బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకుడు షాజహాన్ బాషా ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరవాసులు మతాలకు అతీతంగా తరలివచ్చి ప్రార్థనలు చేశారు. సీబీ రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. రాత్రి ఆధ్యాత్మిక కార్యక్రమాల తోపాటు గంధోత్సవం నిర్వహించారు.



దర్గా వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన చిత్తూరు ఎంపీ



చిత్తూరు సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను సత్కరించి, తిరుమల శ్రీవారి ప్రతిమను అందజేశారు.

మేలపట్టులో పడివేటమ్మ తిరునాళ్ల



ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు బొట్టు పెడుతున్న అర్చకులు

నగరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మేలపట్టు గ్రామంలో పడివేటమ్మ తిరునాళ్లను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

'బీజేపీని బలోపేతం చేయండి'

ఐరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ కార్యకర్తలకు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుమార్ సూచించారు. సోమవారం కాణిపాకంలో మండల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ త్వరలో నిర్వహించనున్న జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, జిల్లా కార్యదర్శి జయచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యుడు చలపతినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నేతలు చిట్టిబాబు, పరదేశి, ప్రకాష్, శేఖర్, గిరి, వీరాస్వామినాయుడు, త్యాగరాజునాయుడు, ఈశ్వరయ్య, మునీంద్రాచారి పాల్గొన్నారు.

అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



నింద్ర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):ఒరూరుపేటలోని గ్రామదేవత అంకాళపరమేశ్వరి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఇదే పంచాయతీ మంగళగిరి గ్రామంలో అంకాళ పరమేశ్వరి ఆలయంలో ఆడి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు గంధమనేని రాజేష్, సర్పంచ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు సారథ్యంలోనే సుపరిపాలన'



ఇరుగువాయిలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పరిపాలనలోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని నింద్ర మండల టీడీపీ అధ్యక్షుడు, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఇరుగువాయి పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు విజయకుమార్, బాబుయాదవ్, స్వయరాజ్, బుజ్జి, ఇళయరాజా, రమేష్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జీడీనెల్లూరు టీడీపీ సమావేశం

వెదురుకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గ స్థాయి టీడీపీ కేడర్ విస్తృత సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు చిత్తూరులోని జిల్లా కార్యాలయంలో జరగనుంది. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బొమ్మిసురేంద్ర, రమణారెడ్డి, గురవారెడ్డి, మండల పరిశీలకుల సమక్షంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. వెదురుకుప్పం, పాలసముద్రం, కార్వేటినగరం, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, గంగాధరనెల్లూరు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సమాచారం అందించారు. నియోజకవర్గంలో టీడీపీ మండల అధ్యక్ష పదవుల నియామకంలో జాప్యం జరుగుతోంది. ఈ విషయం కూడా కొలిక్కి రానుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

అల్లుడిపై మామ దాడి



గాయపడిన జనార్దన్

బంగారుపాళ్యం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లుడిపై మామ దాడి చేసిన సంఘటన టేకుమందలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టేకుమందకు చెందిన జనార్దన్‌కు అదే గ్రామానికి చెందిన సోమశేఖర్ కుమార్తె రూపతో వివాహం జరిగింది. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం జనార్దన్‌పై మామ సోమశేఖర్ తన కుమారుడు యశ్వంత్, కుమార్తె రూప, తమ్ముడు రామ్మూర్తిలతో కలిసి దాడి చేసి గాయపరిచారు. తలకు గాయమవడంతో జనార్దన్‌ను తొలుత బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడిచేసిన సోమశేఖర్, రూప, యశ్వంత్, రామ్మూర్తిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.



బైక్‌ను ఢీకొన్న కారు

● తండ్రీకుమార్తెకు తీవ్రగాయాలు

పూతలపట్టు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో తండ్రీకుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. సదుం మండలం చీకలచేను గ్రామానికి చెందిన రామమూర్తి తన కుమార్తె విమలతో కలిసి పని నిమిత్తం చిత్తూరుకు సోమవారం వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా రంగంపేట క్రాస్ సమీపాన ఫ్లైఓవర్ వద్ద వెళ్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ టీమ్‌లో చేర్చుకోలేదని దాడి

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ టీమ్‌లో చేర్చుకోలేదని దాడి చేసిన సంఘటన రెండో పట్టణ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గాయత్రినగర్‌కు చెందిన కొందరు యువకులు స్థానికంగా క్రికెట్ ఆడుతున్నారు. విక్కీ, అరుళ్, సూరి అనే ముగ్గురు యువకులు తమను కూడా క్రికెట్ టీమ్‌లో చేర్చుకోవాలని కోరారు. అందుకువారు వద్దని చెప్పడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. బాధితుడు ముక్తార్ ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



గుడిపాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బసవాపల్లె బైపాస్‌లో సోమవారం ఓ మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పది రోజులుగా మతిస్థిమితం లేకుండా పలు గ్రామాల్లో తిరిగేవాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్వారీ గుంతలోపడి యువకుడి దుర్మరణం

● మద్యం మత్తే కారణం



కైబల్య నాయక్ మృతదేహం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు క్వారీ గుంతలోపడి దుర్మరణం చెందాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన కైబల్య నాయక్ (35) సోమవారం సాయంత్రం పూటుగా మద్యం తాగి ఎ.వెంకటాపురం నుంచి సర్విరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లేదారిలోని క్వారీ గుంతలోపడిపోయాడు. ఊపిరాడక మృతి చెందాడని క్వారీ కూలీలు గుర్తించారు. క్వారీ మేనేజర్ పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

చిన్నారులకు బ్యాగులు, బిస్కెట్ల పంపిణీ



నగరి, ఆగస్టు4 (ఆంధ్ర జ్యోతి): మాంగాడు, మాంగాడు దళితవాడ, నగరి ఎస్టీకాలనీ, తలారివీధి తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు జాతీయ సాక్షరతా మిషన్ సౌజన్యంతో బ్యాగులు, బిస్కెట్లు సోమవారం చేనేత కార్మిక నాయకులు పంపిణీ చేశారు. జాతీయ చేనేత దిన వారోత్సవాలను మాంగాడులో ఘనంగా జరుపుకున్నారు. చేనేత కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, నాయకులు జ్యోతినాయుడు, గుణశేఖర్, సర్పంచ్ ఆనంద్ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరాకుమారి, నాయకులు శివకుమార్‌రెడ్డి, గోపాలశెట్టి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్త కళా ప్రదర్శనకు స్పందన

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శనకు స్పందన లభిస్తోంది. ప్రదర్శనలో పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్, పోచంపల్లె చీరలు, డ్రెస్ మెటీరియల్స్ చుడీదార్స్ షూటింగ్స్ షర్టింగ్స్ జ్యువెలరీస్, ఇతర గృహ అలంకరణ వస్తువులు, ఊరగాయలు, పచ్చళ్లు, గరం మసాల వస్తువులు, తిను బండారాలు తదితరాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పేమెంట్‌తో విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు సంజయ్ జైన్, బిజు తెలిపారు. ఈ ప్రదర్శన మరో వారం పాటు నిర్వహిస్తున్నామని.. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





దుస్తులు, ఆభరణాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్షిప్తంగా..

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

విజయపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై జగన్నాథపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏవో రజనీకుమారి, జిల్లా ప్రకృతివ్యవసాయాధికారి నాంచేరమ్మ సూచనలు ఇచ్చారు. సిబ్బంది రమేష్, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

తవణంపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఈచర్ లారీ, కారు, 7 ద్విచక్ర వాహనాలను బుధవారం తవణంపల్లె పోలీసుస్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోలీసుస్టేషన్‌లో అదే రోజు ఉదయం 10 గంటలకు సంబంధిత రుసుం చెల్లించి, వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి: ఎంపీడీవో

వెదురుకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పురుషోత్తం ఆదేశించారు. సోమవారం తన సమావేశపు మందిరంలో జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణచైతన్య, ఆడబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, సీహెచ్‌వో కొప్పేటి మధుసూదన్, హెల్త్ అసిస్టెంట్ పి.కృష్ణారెడ్డి, ఉద్యోగులు హాజరయ్యారు.

స్వీయరక్షణపై ఆడపిల్లలు దృష్టి సారించాలి

పెనుమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్వీయరక్షణపై ఆడపిల్లలు దృష్టి సారించాలని అభయ ఫౌండేషన్ సభ్యుడు హరికృష్ణారెడ్డి సూచించారు. సోమవారం ఉగ్రాణంపల్లె ప్రభుత్వ పాఠశాలలో స్వీయరక్షణపై అవగాహన కల్పించారు. హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనంలో వైద్య పరీక్షలు

పెనుమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఐసీటీసీ వాహనం ద్వారా హెచ్ఐవీ, హెచ్‌బీ, హెచ్‌సీవీ వంటి పరీక్షలు మొబైల్ వాహనంలో ఉచితంగా చేస్తారని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం చార్వాగానిపల్లె సచివాలయం వద్ద స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ వాహనం మండలంలో నాలుగు రోజులు ఉంటుందని చెప్పారు. డాకర్లు హర్షవర్ధన్, శంకర్ వైద్య బృందం పాల్గొన్నారు.

సింహ వాహనంపై కరుమారి నిమ్మాళమ్మ



గంగాధరనెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆడినెల పురస్కరించుకుని వీరకనెల్లూరు దళితవాడలోని కరుమారి నిమ్మాళమ్మను సింహవాహనంపై అధిష్ఠింపజేసి, ఊరేగించారు. ఇంటింటివద్ద మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

నింద్ర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శివప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

వెదురుకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత కళాశాలలో ఇంటర్మీడియట్ హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభించామని ఎంఈవో దామోదరం సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.అశోక్‌బాబు, కో-ఆర్డినేటరు ఎ.బాలాజీ, చెన్నైకేశవులు, సీఆర్పీ ఇందిరప్రియదర్శిని పాల్గొన్నారు.